సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

మంగళవారం । 11 । ఫిబ్రవరి । 2025



తిరుపతి నుంచి షిర్డీకి రైలు సౌకర్యం కల్పించాలి

ప్రజల సౌకర్యం కోసం తిరుపతి-షిర్డికి నేరుగా రైలు సౌకర్యం కల్పించాలని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి సోమవారం కేంద్ర మంత్రిని కోరారు. - 8లో



బరి తెగించిన దొంగలు

డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులోని వీవీరెడ్డి నగర్ కాలనీలో ఈ-క్వార్టర్స్ లైన్‌లో ఆదివారం రాత్రి భారీ చోరీ జరిగింది. - 8లో

గరిష్టం/కనిష్టం 33.0 /17.7

వాతావరణం

జిల్లాలో సోమవారం 17.7 - 33.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపాలి

– జేసీ అదితిసింగ్

కడప సెవెన్‌రోడ్స్: ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం సభాభవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)లో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీలను స్వీకరించారు. జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, ఎస్డీసీలు శ్రీనివాసులు, వెంకటపతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ ఈ.జి అశోక్‌కుమార్

కడప అర్బన్ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ప్రజలు ఇచ్చే ఫిర్యాదులపై సత్వరం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలనీ ఎస్పీ ఈ.జి అశోక్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన ఫిర్యాదుదారులతో ఎస్పీ స్వయంగా మాట్లాడి, వారి సమస్యను విన్నారు. సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేసి, వారి సమస్యను పరిష్కరించాలని సూచించారు. జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్‌బాబు, డి.టి.సి. డీఎస్పీ అబ్దుల్ కరీం, మహిళా పీఎస్ డీఎస్పీ రమాకాంత్ పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

కడప ఎడ్యుకేషన్ : యోగివేమన విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలలకు సంబంధించిన బీఏ,బీఎస్సీ, బీకాం, బీబీఏ, బీసీఏ 1,3,5 సెమిస్టర్ల పరీక్షా ఫలితాలను సోమవారం విశ్వవిద్యాలయ వీసీ కె. కృష్ణారెడ్డి, ప్రధానాచార్యులు ఆచార్య ఎస్.రఘునాథ రెడ్డి, రిజిస్ట్రార్ పి. పద్మ, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కెఎస్వీ కృష్ణారావుతో కలసి విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ వైవీయూలోని తమ చాంబరులో ఫలితాలను పరిశీలించారు. ఫస్ట్ ఇయర్ బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ కోర్సులలో 7,077 మంది పరీక్షలకు హాజరు కాగా 4,484 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మూడో సెమిస్టర్ డిగ్రీ పరీక్షలకు అన్ని గ్రూపులు కలుపుకొని 6,075 మంది పరీక్షలకు హాజరు కాగా 3,851 ఉత్తీర్ణులయ్యారు. డిగ్రీ ఐదో సెమిస్టర్‌కు సంబంధించి అన్ని గ్రూపులు కలుపుకొని 4,859 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 3,782 విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. త్వరితగతిన పరీక్షా ఫలితాలు విడుదల చేసిన పరీక్షల విభాగాన్ని వీసీ అభినందించారు. విద్యార్థులు ఫలితాల కోసం httpr:www.yvuexams.inఅనే వెబ్సైట్‌ను సందర్శించాలని పరీక్షల నియంత్రణ అధికారి కృష్ణారావు సూచించారు.

ప్రారంభమైన ఇంటర్ ప్రాక్టికల్స్



కడప చైతన్య జూనియర్ కళాశాల కళాశాలలో పరీక్షను పరిశీలిస్తున్న ఆర్ఐఓ వెంకటసుబ్బయ్య

కడప ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ జనరల్ ప్రాక్టికల్ పరీక్షలు సోమవారం జిల్లావ్యాప్తంగా ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి స్పెల్‌లో భాగంగా తొలి రోజు సోమవారం రెండు సెషన్స్‌కు కలిసి జిల్లాలో 97 పరీక్షా కేంద్రాలలో ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహించారు. అన్ని పరీక్షా కేంద్రాలలో సీసీ కెమెరాల పర్యవేక్షణలో ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహించారు. ఇందులో బాగంగా ఉదయం సెషన్‌లో 51 పరీక్షా కేంద్రాలకుగాను 2493 మంది హాజరుకావాల్సి ఉండగా 2432 హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం సెషన్‌లో 46 పరీక్షా కేంద్రాలకుగాను 1715 హాజరుకావాల్సి ఉండగా 1672 హాజరయ్యారు. పరీక్షల తనిఖీలో భాగంగా ఆర్ఐఓ బండి వెంకట సుబ్బయ్య కడపలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఎగ్జామినర్స్‌కు పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. పరీక్ష అనంతరం ఎగ్జామినర్స్ ఉదయం, సాయంత్రం తప్పకుండా విద్యార్థులకు సంబంధించిన సమాధాన పత్రాలను వాల్యూషన్ చేసి మార్కులను ఆన్‌లైన్‌లో ఇంటర్ బోర్డు సైట్‌లో నమోదు చేయాలని సూచించారు.

లంకమల అరణ్యం.. వర్ధిల్లిన శైవం

- కొండూరు బీటులో పదికిపైగా శివాలయాలు
- ఆలయాల పక్కనే వెలుగులోకి వచ్చిన గుహలు
- 4వ శతాబ్దిలో శైవం వర్ధిల్లిన ఆనవాళ్లు
- పక్కనే రాతిబండపై ఆయుధాల గుర్తులు
- ఇక్కడే శివుని పాదముద్రలు, బండపై శాసనాలు
- ఈ ప్రాంతమే కైలాసకోనగా ప్రాచుర్యం



ఆలయాల పక్కనే బండపై నాటి ఆయుధాల ఆకృతి



శివాలయ శిథిల గోడ, పేర్చిన బండరాయి



బి.కొత్తకోట : జిల్లాలోని రాజంపేట నియోజకవర్గం సి ద్దవటం అటవీ ప్రాంతమైన లంకమల అభయారణ్యంలో 4వ శతాబ్ది నాటి మానవుల ఆనవాళ్లు వెలుగులోకి వచ్చాక.. ఈ ప్రాంతంలో ఇంకా ఎలాంటి విశేషాలు, చరిత్ర దాగున్నాయన్న ఉత్సుకత పెరుగుతోంది. దీనికి తగ్గట్టుగా రోజుకో కొత్త విషయం బయటికి వస్తోంది. కొత్తగా సిద్దవటం అటవీశాఖ క్షేత్రాధికారిణి బి.కళావతి.. వెలుగులోకి తెచ్చిన ఫొటోల ఆధారంగా మరిన్ని విషయాలు బాహ్య ప్రపంచంలోకి వచ్చాయి. సాక్షిలో 'ఆధ్యాత్మిక క్షేత్రం.. లంకమల' కథనం ద్వారా పలు ఆసక్తికర అంశాలను వెలుగులోకి తేవడం తెలిసింది. ప్రస్తుతం ఆ కథనానికి మరింత బలం చేకూర్చే మరిన్ని ఆధారాలు లభ్యమయ్యాయి. ఒకే చోట గుహ, బండపై శాసనం, శిథిలమైన శివాలయాల ఆనవాళ్లు, శివుని పాద ముద్రలు, అక్కడే పైనుంచి కిందికి దూమికే జలపాతం.. ఇలా అన్నీ ఆధారాలు వెలుగులోకి వచ్చిన ఈ ప్రాంతానికి కైలాసకోనగా ప్రాచుర్యం ఉంది. అంటే శివుడు నివసించిన ప్రాంతమని అర్థం. కాబట్టి శైవం ఏ స్థాయిలో ఇక్కడ వర్ధిల్లిందో దీన్ని బట్టి స్పష్టంగా అర్థమవుతోంది. అందిన ఆధారాలను పురావస్తు శాఖ క్షుణ్ణంగా పరిశీలిస్తోంది.

బండలపై ఆధారాలు


ఈ ప్రాంతంలో శైవ క్షేత్రం వర్ధిల్లిందని.. ఆనాటి శైవులు బండలపై శాసనాలు, ఇతర గీతల ద్వారా వెల్లడవుతోంది. శాసనాలను బట్టి 4వ శతాబ్దినాటి శైవులు ఇక్కడ ఉన్నట్టు నిర్ధారిస్తున్నారు. అప్పట్లో ఎలాంటి ఆయుధాలు వినియోగించారో.. తెలిపేలా బండలపై వాటి ఆకృతి తెలిపేలా చెక్కారు. మరోచోట శాసనం, పక్కనే శివలింగ ఆకారం ఉన్నాయి. ఇక్కడి శిథిల ఆలయాల నిర్మాణం కోసం చతురస్రాకారంలో ఉండే బండలను వినియోగించారని, వాటిని బట్టి స్పష్టం అవుతోంది.

పై కైలాసం.. జారే జలపాతం


శైవ క్షేత్రాలున్నట్టు గుర్తించిన ప్రాంతానికి సమీపంలోనే పై కైలాసకోన ఉంది. ఇది అద్భుతమైన జలపాతం. పై నుంచి జలపాతం కిందకు దూకే ప్రాంతం అత్యంత భయంకరంగా కనిపిస్తుంది. కొండనడుమ దూకే జలపాత ప్రాంతం ప్రకృతి సౌందర్యాన్ని తలపిస్తుంది. ఈ జలపాతంపై నుంచి కిందకు జారితే కైలాసానికి చేరినట్టే. అందుకనే దీన్ని పై కైలాసంగా ప్రాచుర్యంలో ఉంది. జలపాతం దిగువన గుహలు, ఆలయాలతో కూడిన ప్రదేశమే దిగువ కైలాసకోన.

అక్కడే గుహ.. ఆలయాలు

లంకమల మొత్తం 36 వేల హెక్టార్ల మేర విస్తరించి ఉండగా.. అందులో సిద్దవటం రేంజి పరిధిలో 26 వేల హెక్టార్ల అభయారణ్యం ఉంది. అడవిలోని కొండూరు బీటులో శైవ క్షేత్ర ఆనవాళ్లు విస్తృతంగా లభ్యమయ్యాయి. దిగువ కైలాసకోనగా పిలువబడే.. ఈ ప్రదేశంలో ఆర ఎకరం విస్తీర్ణంలో పదికిపైగా శివాలయాల శిథిలాలు ఉన్నాయి. వీటికి సంబంధించిన పునాదుల బండరాళ్లు, వాటి నిర్మాణం కనిపిస్తున్నాయి. పడిపోయిన గోడలు, వాటి శిథిలాలు ఉన్నాయి. దీన్ని ఆధారంగా చేసుకుంటే వాటిని ఆలయాలుగా భావిస్తున్నారు. ఈ చోటనే గుహను కూడా గుర్తించారు. ఆలయాల వద్ద పూజల నిర్వహణ, గుహలో సిద్ధులు, యోగులు తపస్సు చేసుకునేవారు. ఇక్కడే శివుడ్ని ఆరాధిస్తున్న వీరుడి విగ్రహం లభ్యమైంది. ఈ ప్రాంతం దిగువ కైలాసకోనగా ఇప్పటికీ ప్రాచుర్యంలో ఉంది. ఈ అడవికి సమీపంలో సిద్దవటం గ్రామం ఉంది. అంటే సిద్ధులకు ఈ ప్రాంతం నివాసమని భావిస్తున్నారు. దీనివల్లే సిద్దవటం అని పేరొచ్చిందని చెబుతారు.



కొండూరు బీటులో గుహ



ఎగువ కైలాసకోన జలపాతం

13న జాబ్‌మేళా

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 13న గురువారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ తెలిపారు. ఐటీఐ ఫిట్టర్, ఇంటర్, డిగ్రీ, బిటెక్, మాస్టర్ డిగ్రీతోపాటు డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు 9347256400, 9390052901 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కరుణచూపే తల్లి లూర్దుమాత


కడప కల్చరల్ : లూర్దుమాత కరుణచూపే తల్లి అని, దేవుని ఆజ్ఞ మేరకు కరుణామయుడైన క్రీస్తును ఈ లోకానికి అందించిన మహోన్నతమైన మాతృమూర్తి అని రెవరెండ్ ఫాదర్ కాసు లూర్దు పేర్కొన్నారు. స్థానిక మరియాపురం లూర్దుమాత తిరుణాల ఉత్సవాలలో భాగంగా సోమవారం కడప నగరంలోని డాన్‌బాస్కో ఐటీఐ వద్ద నుంచి లూర్దుమాత ఊరేగింపు నిర్వహించారు. తొలుత చర్చిలో ప్రార్థనలు చేశారు. అనంతరం పూలు, రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించిన తేరుపై మరియమాతను కొలువుదీర్చారు. గురువుల దివ్యబలిపూజ అనంతరం ఆయన మాట్లాడుతూ మరియమాతకు లూర్దుమాతగా పేరు ఎలా వచ్చిందో వివరించారు. డాన్‌బాస్కో గురువులు దివ్య బలిపూజ నిర్వహించారు. కోయర్ బృందం స్తుతి గీతాలను ఆలపించారు. అనంతరం మరియమాత ఊరేగింపును ప్రారంభించారు. రెవరెండ్ ఫాదర్ తలారి బాలరాజు పాల్గొన్నారు.

తిరుణాల సందడి

మరియాపురం పాత చర్చి ఆవరణలో సోమవారం నాటికే తిరునాల సందడి నెలకొంది. చర్చి ప్రాంగణంలో దుకాణాలు, రంగుల రాట్నాలు, పలురకాల ఆటవస్తువులు తదితరాలను ఏర్పాటు చేశారు. మంగళవారం ఈ ప్రాంగణంలో తిరునాల జరగనుంది. మధ్యాహ్నం 2.30 గంటలకు బండలాగుడు పోటీలు నిర్వహిస్తారు. తిరునాల సందర్భంగా నిర్వహించే పలు పోటీలలో విజేతలకు బహుమతులను అందజేస్తారు.

ముగిసిన లాటరీ ప్రక్రియ

గీత కులాలకు 14 మద్యం షాపులు కేటాయింపు



లక్కీ డ్రా కాయిన్‌ను చూపుతున్న జాయింట్ కలెక్టర్ అదితిసింగ్



హాజరైన దరఖాస్తుదారులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలో గీత కులాలకు సంబంధించి 14 మద్యం షాపులను లాటరీ పద్ధతిలో కేటాయించామని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో గీత కులాలకు లాటరీ పద్ధతిలో 14 మద్యం షాపులు కేటాయింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ లాటరీ ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో గీత కులాలకు సంబంధించి 14 మద్యం షాపులకు సంబంధించి 162 దరఖాస్తులు రాగా వాటిని లాటరీ పద్ధతిలో ఎంపిక అయిన వ్యక్తులకు మద్యం షాపులను కేటాయించామన్నారు. ఈ లాటరీ ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా నిబంధనలకు అనుగుణంగా పకడ్బందీగా నిర్వహించామని స్పష్టం చేశారు. జిల్లాలో మొత్తం 14 మద్యం దుకాణాలకు గాను పెద్దముడియంలో ఎవరూ దరఖాస్తు చేసుకోకపోవడంతో పెండింగ్‌లో ఉంచారు. అలాగే వల్లూరు మండలానికి ఒకరు మాత్రమే దరఖాస్తు చేసుకోవడంతో ఆ వ్యక్తికే షాపును కేటాయించారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటి కమిషనర్ జయరాజు, సూపరింటెండెంట్ రవి కుమార్, అసిస్టెంట్ ఎక్సైజ్ ఆఫీసర్ వినోద్ కుమార్ నాయక్, సీఐ కృష్ణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీని పటిష్టం చేద్దాం

– వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి



అనుబంధ విభాగాల అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : పార్టీని పటిష్టం చేయాల్సిన బాధ్యత అనుబంధ సంఘాల మీద ఉందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో అనుబంధ సంఘాల అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ బలోపేతానికి క్రమశిక్షణతో పనిచేసే వారిని గుర్తించి అనుబంధ సంఘాల కమిటీలు వేయాలన్నారు. ఇందుకోసం ప్రతి నియోజకవర్గంలో పర్యటిస్తామని తెలిపారు. గతంలో పార్టీకేడర్‌ను అలక్ష్యం చేసిన మాట వాస్తవమేనని, ఇకపై అలా జరగదని సాక్షాత్తు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డే చెప్పారని గుర్తు చేశారు. ప్రస్తుత కష్ట సమయంలో పార్టీకి అండగా ఉండాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పార్టీ శ్రేయస్సు కోసం అనుబంధ సంఘాల అధ్యక్షులు, అందులో నియమితులయ్యే వారు, కార్యకర్తలు అందరూ కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి 8 నెలలు అవుతున్నా ఉద్యోగులకు జీతాలు, పింఛన్లు తప్పా ఏమీ ఇవ్వలేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా కొనసాగి ఉంటే రైతు భరోసా, అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు ఎప్పుడో వచ్చి ఉండేవన్నారు. ఇవన్నీ ప్రజల్లోకి తీసుకుపోవాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులిసునీల్, అనుబంధ విభాగాల అధ్యక్షుడు జీవీ రాఘవరెడ్డి, దేవిరెడ్డి ఆదిత్య, రామకృష్ణారెడ్డి, సాయిదత్త, వేణుగోపాల్ నాయక్, వెంకటేశ్వర్లు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

విలువలకు నీళ్లొదిలిన ఎమ్మెల్యే!

- స్వచ్ఛమైన నీటిపై మురికి రాజకీయం
- మొన్న వైఎస్సార్‌సీపీ నేత త్యాగరాజు వాటర్‌ప్లాంట్ కూల్చివేసేందుకు విఫలయత్నం
- నేడు దేవిరెడ్డి ఆదిత్య వాటర్‌ప్లాంట్‌తో పాటు మరోదానికి సీల్
- నిబంధనలను 'గంగ'పాలు చేస్తున్న ఎమ్మెల్యే... నగరపాలకాధికారి



కో ఆపరేటివ్ కాలనీలోని వైఎస్సార్ ప్యూరిఫైడ్ వాటర్‌ప్లాంటుకు సీల్ వేసిన దృశ్యం

కడప టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కడప నగరంలో కక్షపూరిత రాజకీయాలకు తెరలేచింది. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా ఈ దాడులు,దౌర్జన్యాలు సాగుతున్నాయన్న విమర్శలున్నాయి. ప్రజలకు శుద్ధి చేసిన నీటిని అందించాలన్న లక్ష్యంలో గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎన్‌టీఆర్ సుజల ప్రవంతి పథకం ద్వారా ఎంపీ నిధులు, ఏపీఎండీసీ నిధులను వెచ్చించి నగరంలో సుమారు 10 వాటర్‌ప్లాంట్లు నిర్మించారు. వాటి ద్వారా పేదలు నివాసం ఉన్నచోట రూ.5లకే క్యాన్ శుద్ధి చేసిన నీటిని అందించేవారు. కాలానుగుణంగా అందులో కొన్ని ప్లాంట్లు మూతబడ్డాయి. మరికొన్ని కొనసాగుతున్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక వాటి పేరు వైఎస్సార్ ప్యూరిఫైడ్ వాటర్‌ప్లాంట్లుగా మార్చారే తప్పా మూసివేయించలేదు. వీటివల్ల పేదలకు సురక్షిత నీరు అందుతుండటమే ఇందుకు కారణంగా చెబుతున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 8 నెలల తర్వాత ఆ వాటర్ ప్లాంట్లపై అధికార పార్టీ నేతలు కన్నేశారు. వాటిని ఎలాగైనా మూసివేయించాలని, తద్వారా వాటిని నడుపుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయాలని పథక రచన చేసినట్లు సమాచారం. ఇందులో భాగంగానే మొన్న మాసాపేటలో వైఎస్సార్‌సీపీ 26వ డివిజన్ ఇన్‌చార్జి త్యాగరాజు తన సొంత స్థలంలో ఏర్పాటు చేసుకున్న వాటర్‌ప్లాంటును కూల్చివేసేందుకు నగరపాలక అధికారులు రోజంతా కాచుక్కూర్చున్నారు. కానీ వారి ప్రయత్నాలు సాగలేదు. తాజాగా పాఠశాలల్లో వాటర్‌ప్లాంట్లు నడుపుతున్నారనే కారణంతో కో ఆపరేటివ్ కాలనీలోని వైఎస్సార్ ప్యూరిఫైడ్ వాటర్‌ప్లాంట్, ఆకుల వీధిలోని మరొక వాటర్‌ప్లాంటును అధికారులు సీజ్ చేయడం కలకలం రేపుతోంది. చెమ్ముమియ్యాపేటలోని ఇంకో వాటర్ ప్లాంటును కూడా మూసివేయించేందుకు అధికారులు యత్నించినప్పటికీ న్యాయస్థానం ఆదేశాలతో దాని జోలికిపోనట్లు సమాచారం. కడప ఎమ్మెల్యే, టీడీపీ జిల్లా ముఖ్యనేత ఆదేశాల మేరకే ఈ వ్యవహారమంతా సాగుతున్నట్లు కడప నగరం కోడై కూస్తోంది. అధికార పార్టీ నేతల ఆదేశాలకు నగరపాలక ముఖ్య అధికారి తానా అంటే తందానా అంటూ వత్తాసు పలుకుతున్నట్లు అర్థమవుతోంది. ఈ వాటర్ ప్లాంట్ల ద్వారా పేదలకు సురక్షిత నీరు అందించడమేగాక నగరపాలక సంస్థకు కూడా కొంత ఆదాయం సమకూరుతోంది. దీనికి గండికొట్టేలా అధికార పార్టీ నాయకులు వ్యవహరిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుల ఆర్థిక మూలాలను దెబ్బతీస్తున్నామనే భ్రమలో వారు పేదల నోటికాడి నీరు లాగేస్తున్నారన్న సత్యాన్ని మరుస్తున్నారని వారు పేర్కొంటున్నారు. అన్ని అనుమతులు ఉన్నప్పటికీ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి నిధులతో నిర్మించారన్న అక్కసుతో వీటిని మూయించాలని స్కెచ్ వేసినట్లు చెబుతున్నారు.

ఎజెండాలో చేర్చేందుకు కమిషనర్ ససేమిరా...

వాటర్‌ప్లాంట్లను ఈ ఏడాది కూడా కొనసాగించడానికి మేయర్, నగరపాలకవర్గం చేసిన ప్రయత్నాలకు కమిషనర్ అడ్డుకట్ట వేసినట్లు తెలుస్తోంది. టేబుల్ ఎజెండాగా ఆ అంశాలను స్టాండింగ్ కమిటీ ముందుకు తీసుకురాగా, కమిషనర్ వాటిని ఎజెండాలో చేర్చేందుకు అంగీకరించలేదని సమాచారం. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి లేనట్లు తెలుస్తోంది. నగరపాలకవర్గంలోని సభ్యులు ఏ విషయంపై ఫిర్యాదు చేసినా కమిషనర్ వాటిని ఎజెండాలో చేర్చి చర్చించేందుకు పాలకవర్గానికి అవకాశమివ్వాలి. కానీ దీనికి విరుద్ధంగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. కమిషనర్ వ్యవహారశైలి ఏకపక్షంగా ఉందని పలువురు విమర్శిస్తున్నారు.

పేద, బడుగు, బలహీన వర్గాలు శుద్ధి చేసిన నీటిని తాగకూడదా

పేదలు, బడుగు, బలహీన వర్గాల ప్రజలు శుద్ధి చేసిన నీటిని తాగకూడదా...ఈ ప్లాంటు ఒక వ్యక్తికి ఇవ్వలేదు. ప్రజలకు సేవ చేస్తున్నారనే కారణంతో ఒక ఆర్గనైజేషన్‌కు ఇచ్చారు. దాని ద్వారా పేదలకు రూ.5లకే క్యాన్ నీటిని అందిస్తుంటే సహించలేకపోతున్నారు. పేరుకే పాఠశాలగానీ...గతంలో ఈ బిల్డింగ్‌లో శానిటేషన్ మెటీరియల్ ఉంచేవారు. దళితులు, బీసీ వర్గాలకు తాగునీరు ఇస్తుంటే జీర్ణించుకోలేకపోతున్నారు. కడపలో ఎన్నడూ ఇలాంటి సంస్కృతి లేదు. కక్షపూరిత రాజకీయాలకు ఇది పరాకాష్ట.

– దేవిరెడ్డి ఆదిత్య, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం

క్లుప్తంగా

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

సింహాద్రిపురం : మండలంలోని కోరగుంటపల్లె గ్రామానికి చెందిన చింతపండు పెద్దన్న (50) సోమవారం సాయంత్రం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్థుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు తొండూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్లర్క్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్దన్న మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై ఇప్పటివరకు కేసు నమోదు కాలేదు.

వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

సింహాద్రిపురం : మండలంలోని లోమడ గ్రామానికి చెందిన కుళ్లాయప్ప అనే వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్‌ఐ పెద్ద ఓబన్న తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ లోమడ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అంకాలమ్మ గూడూరులో ఆదివారం విందు ఏర్పాటు చేశారన్నారు. ఈ విందులో నాగరాజు, కుళ్లాయప్పల మధ్య మాటా మాట పెరిగి కుళ్లాయప్ప నాగరాజుపై దాడి చేశారన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గాయపడిన ట్రాక్టర్ డ్రైవర్ మృతి



మృతి చెందిన కుప్పాల జనార్దన

చింతకొమ్మదిన్నె : మండల పరిధిలోని జమాల్‌పల్లె వద్ద జాతీయ రహదారిపై గత గురువారం ట్రాక్టర్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన కుప్పాల జనార్దన(28) రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఇతని స్వగ్రామం సిద్దవటం మండలం పాలకొండ్రాయినిపల్లె. మృతుడి తల్లి ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చింతకొమ్మదిన్నె సీఐ శివ శంకర్ నాయక్ తెలిపారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరి మృతి

పీలేరు రూరల్ : రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన సోమవారం ఉదయం మండలంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కేవీపల్లె మండలం సారకాయలపేటకు చెందిన ఎస్. మహబూబ్‌బాషా (37) ద్విచక్రవాహనంలో ఆదివారం రాత్రి స్వగ్రామానికి బయలుదేరాడు. తలపులకు చెందిన హరిబాబు ద్విచక్ర వాహనంలో పీలేరుకు వస్తుండగా, పీలేరు రాయచోటి జాతీయ రహదారి ముడుపు వేముల వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మహబూబ్‌బాషా అక్కడికక్కడే మృతి చెందాడు.

అనారోగ్యంతో రైతు ఆత్మహత్య

మదనపల్లె : అనారోగ్యంతో మనస్తాపం చెంది రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం చిత్తూరు జిల్లా పుంగనూరు మండలంలో జరిగింది. రాజులూరుకు చెందిన రైతు గోవిందరాజు(55) వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నాడు. అయితే, గత కొంతకాలంగా తనతోపాటు భార్య అనారోగ్యంతో బాధపడుతుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మనస్తాపం చెంది పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

బరి తెగించిన దొంగలు

- ఆర్టీపీపీలో ఏకంగా ఆరు ఇళ్లలో చోరీ యత్నం
- ఒక ఇంటిలో ఐదు తులాల బంగారం, వెండి నగలు అపహరణ
- రంగంలోకి డాగ్‌స్క్వాడ్
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు





సంఘటన స్థలంలో తెరిచి ఉన్న బీరువా, చెల్లాచెదురుగా పడి ఉన్న వస్తువులు

ఎర్రగుంట్ల : డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులోని వీవీరెడ్డి నగర్ కాలనీలో ఈ–క్వార్టర్స్ లైన్‌లో ఆదివారం రాత్రి భారీ దొంగతనం జరిగింది. దొంగలు ఏక కాలంలోనే ఆరు ఇళ్లలో చోరీకి యత్నించడంతో కాలనీవాసులు హడలెత్తిపోతున్నారు. ఇందులో ఒక ఇంటిలో మాత్రం ఐదు తులాల బంగారం, వెండి చోరీ జరిగింది. సంఘటన స్థలాన్ని జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు, కొండాపురం సీఐ మహమ్మద్ రఫీ పరిశీలించారు. క్లూస్ టీం వేలి ముద్రలు సేకరించగా, డాగ్ స్క్వాడ్‌ను కూడా రంగంలోకి దింపారు.

పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆర్టీపీపీలోని ఈ–టైపు క్వార్టర్స్‌లో ఉన్న 96, 207, 112, 213, 214, 338 క్వార్టర్స్‌లో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. 338 క్వార్టర్స్‌లో రమేష్‌రెడ్డి, పద్మజ దంపతులు నివాసం ఉన్నారు. వీరిద్దరు ఆర్టీపీపీలో ఏఈలుగా పని చేస్తున్నారు. వీరి స్వస్థలం పులివెందుల. పద్మజ గర్భిణిగా ఉండటంతో భర్త రమేష్‌రెడ్డితో కలిసి వైద్య పరీక్షల నిమిత్తం పులివెందుల ఆసుపత్రికి వెళ్లారు. సోమవారం ఉదయాన్నే బయటకు వచ్చిన ఎదురింటి వారు ఇంటి తలుపు తాళాలు కోసి ఉండటాన్ని గమనించి వెంటనే ఏఈ రమేష్‌రెడ్డికి సమాచారం అందించారు. ఆయన కలమల్ల పోలీసులకు విషయం చేరవేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని చూడగా ఇంటిలో బీరువా తెరిచి అందులోని వస్తువులన్నీ చెల్లాచెదురు చేసి ఉన్నారు. ఆ తర్వాత రమేష్‌రెడ్డి వచ్చి చూడగా ఐదుతులాల బంగారు నగలు, వెండి నగలు దొంగలు ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు తెలిపారు.



సంఘటన స్థలంలో డాగ్ స్క్వాడ్ పరిశీలన

ఎస్‌ఐ నివాసం ఉన్న లైన్‌లోనే ఐదు ఇళ్లలో చోరీ యత్నం..

ఈ–టైపులో ఉన్న 96, 207, 112, 213, 214 క్వార్టర్స్‌లో కూడా దొంగలు చోరీకి యత్నించారు. అయితే ఈ ఇళ్లలోనూ వారికి ఎలాంటి నగలు, నగదు లభించలేదు. ఇదే లైన్‌లో ఎస్‌ఐ నివాసం ఉండటం గమనార్హం. ఎస్‌ఐ ఇంటి ఎదురుగానే ఉన్న క్వార్టర్స్‌లోనూ చోరీ యత్నం చేశారు. సాయంత్రం డాగ్ స్క్వాడ్ క్వార్టర్ 338 నుంచి అదే లైన్‌లో వెళ్లి అక్కడి నుంచి పక్క లైన్ ద్వారా బ్యాంకు వద్ద ఖాళీ స్థలంలోకి వచ్చి ఆగింది. బ్యాంకు వద్ద ఉన్న సీసీ కెమెరాలోని ఫుటేజీను డీఎస్పీ పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. సీఐ మహమ్మద్ రఫీ, ఎస్‌ఐలు తిమోతి, విద్యాసాగర్‌లు కూడా సంఘటన స్థలంలో విచారణ చేపట్టారు.

అన్ని కోణాలలో విచారణ చేపడతాం : జమ్మలమడుగు డీఎస్పీ

ఈ సంఘటనపై జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు కలమల్ల పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి అన్ని కోణాలలో విచారణ చేపడతామన్నారు. ఏక కాలంలో ఆరు ఇళ్లలో చోరీకి యత్నించగా ఒక ఇంటిలోనే బంగారు, వెండి నగలు చోరీ జరిగిందన్నారు. ఎవరైనా బయటకు వెళ్లేటప్పుడు సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇస్తే పోలీసులు ఆ ప్రాంతంలో నిఘా పెడతారన్నారు. ఆర్టీపీపీలో ప్రత్యేక పోలీస్ బలగాలు ఉన్నా ఈ సంఘటన జరిగిందన్నారు. కొత్త వ్యక్తులు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారిని విచారిస్తున్నామని డీఎస్పీ విలేకరులకు తెలిపారు.

చోరీల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్



ఖాజీపేట : 'చోరీల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాం.. ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయి. పూర్తిగా అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం' అని జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ అన్నారు. సోమవారం ఖాజీపేట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోల్‌కాల్‌లో పోలీసుల పనితీరుపై ఆరా తీశారు. రికార్డులను స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మొబైల్ గేమింగ్‌ల వల్ల యువత చాలా నష్టపోతున్నారన్నారు. వీటి బారిన పడకుండా ప్రజల్లో అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఫ్యాక్షన్ గ్రామాల్లో నిద్ర..

ప్రతి 15 రోజులకు ఒకసారి ఫ్యాక్షన్ గ్రామాల్లో పోలీసులు పల్లెనిద్ర చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే అక్కడే ప్రజలతో మాట్లాడి పరిష్కరించేలా చర్యలు చేపడతామన్నారు.

ఆలయాలకు సీసీ కెమెరాలు..

చోరీల నియంత్రణలో భాగంగా ప్రతి ఆలయానికి సీసీ కెమెరాలు బిగించేలా అవగాహన కల్పించాలన్నారు. సీసీ కెమెరాలు బిగించని ఆలయాలకు నోటీసులు ఇచ్చి బిగించేలా చూస్తామన్నారు.

గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ కార్యక్రమం చేపడతాం

జిల్లాలో అన్ని పాఠశాలల్లో గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలో జరిగిన కొన్ని సంఘటనలను దృష్టిలో ఉంచుకుని ఈ కార్యక్రమం చేపట్టనున్నామన్నారు.

బేసిక్ పోలీసింగ్.. విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యే చర్యలు

బేసిక్ పోలీసింగ్.. విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. అందులో భాగంగానే ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామన్నారు. పాఠశాలల వద్ద మహిళల పట్ల అసభ్య ప్రవర్తన, మద్యం మత్తులో గొడవలు, చైన్ స్నాచింగ్ వంటి వాటి నివారణకు కూడా ఆదేశాలు జారీ చేశామని వివరించారు.

నేరాల నివారణకు గస్తీని పెంచండి

మైదుకూరు : దొంగతనాలు, ఇతర నేరాలు జరగకుండా పగలు, రాత్రి గస్తీని ముమ్మరంగా నిర్వహించాలని ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఆయన మైదుకూరు అర్బన్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను ఎస్పీ పరిశీలించి అర్బన్ సీఐ హాసంతో మాట్లాడారు. పనితీరును మెరుగుపరుచుకోవాలని సిబ్బందికి సూచించారు. పెండింగ్ కేసులను త్వరగా విచారించి పరిష్కరించాలన్నారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా అవగాహన కల్పించాలన్నారు.

గండి ఆలయ అధికారిపై గవర్నర్‌కు ఫిర్యాదు

చక్రాయపేట : గండి వీరాంజనేయ స్వామి దేవస్థానం అధికారి వెంకటసుబ్బయ్యపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్ర గవర్నర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ తెలిపారు. దేవదాయ – ధర్మాదాయ శాఖ చట్టం 1987 నియమ నిబంధనలను తుంగలో తొక్కి అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. గండి ఆలయ మహా కుంభాభిషేకం త్వరితగతిన చేయించి భక్తులకు మూలవిరాట్ దర్శనం చేయించాలంటే పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆలయ అభివృద్ధితో పాటు చేపట్టాల్సిన కార్యక్రమాలపై పాలక మండలి తీర్మానాలు లేకుండానే ఏకపక్ష నిర్ణయం తీసుకుంటున్నారని తెలిపారు.

విద్యార్థి మృతదేహానికి పోస్టుమార్టం

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని స్విస్ట్ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో ఉన్న నారాయణ హైస్కూల్‌లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విద్యార్థి నందిమండలం మదన్‌మోహన్‌రెడ్డి (15) మృతదేహానికి ఆదివారం రిమ్స్‌లో పోస్టుమార్టం నిర్వహించారు. మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. కడప డీఎస్పీ ఏ. వెంకటేశ్వర్లు, చింతకొమ్మదిన్నె సీఐ శంకర్‌నాయక్, ఎస్‌ఐ శ్రీనివాసుల రెడ్డి, తమ సిబ్బందితో కలిసి నారాయణ హైస్కూల్‌లో తరగతి గది, హాస్టల్ రూంల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. ఈ సంఘటనపై మృతుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రిమ్స్ మార్చురీ, నారాయణ హైస్కూల్ వద్ద పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు విధులను నిర్వహించారు.



మదన్‌మోహన్‌రెడ్డి మృతదేహం

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రస్థాయి ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయుల క్రీడా పోటీల్లో జిల్లాకు చెందిన ఫిజికల్ డైరెక్టర్లు సత్తా చాటారు. కాకినాడలో ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించిన ఏపీ పీఈటీస్ అండ్ పీడీస్ సెమినార్, టోర్నమెంట్‌లో జిల్లాకు చెందిన ముగ్గురు వ్యాయామ ఉపాధ్యాయులు పతకాలు సాధించారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారి 50 ప్లస్ వయో విభాగంలో పాల్గొని 100 మీటర్ల పరుగుపందెంలో రజత పతకం సాధించారు. అదే విధంగా బ్యాడ్మింటన్‌లో సైతం రజతం సాధించి ఆదర్శంగా నిలిచారు. ఈమెతో పాటు 50 ప్లస్ విభాగంలో లెక్కలవారిపల్లె జెడ్పీహెచ్ఎస్ ఫిజికల్ డైరెక్టర్ పి. ఫాతిమా 100 మీటర్ల పరుగుపందెంలో స్వర్ణపతకం, 400 మీటర్ల నడకలో రజతం, షాట్‌పుట్‌లో రజతం, బ్యాడ్మింటన్ సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో రజత పతకాలు సాధించారు. ముక్కావారిపల్లె జెడ్పీహెచ్ఎస్ పీఈటీ బి. పద్మావతి 40 సంవత్సరాల వయసులోపు విభాగంలో బ్యాడ్మింటన్ డబుల్స్ విభాగంలో రజత పతకం, 100 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం సాధించారు. జిల్లాకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించడం పట్ల ఏపీ పీఈటీఎస్ అండ్ ఎస్‌ఏ పీఈ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం. ప్రవీణ్‌కిరణ్, కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, కోశాధికారి అంకారావు తదితరులు అభినందించారు.



ట్రోఫీ, మెడల్స్ అందుకుంటున్న జిల్లాకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు

తిరుపతి నుంచి షిర్డికి రైలు సౌకర్యం కల్పించాలి

- చెన్నై–అహ్మదాబాద్–చెన్నై రైళ్లు కడపలో ఆపాలి
- యురేనియం గ్రామాల రైతుల సమస్యలు పరిష్కరించాలి
- కేంద్ర మంత్రులను కోరిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : ప్రజల సౌకర్యం కోసం తిరుపతి–షిర్డికి నేరుగా రైలు సౌకర్యం కల్పించడంతోపాటు చెన్నై–అహ్మదాబాద్ మధ్య తిరుగుతున్న రైళ్లను కడప స్టేషన్‌లో ఆగేలా చర్యలు తీసుకోవాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సోమవారం కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కోరారు. అలాగే వేముల మండలంలోని యురేనియం ప్రభావిత గ్రామాల రైతులు కొన్ని ఏళ్లుగా ఎదుర్కొంటున్న భూ సేకరణ, ఉద్యోగ అవకాశాల కల్పన వంటి సమస్యలు పరిష్కరించాలని కేంద్ర అణుశక్తిశాఖ సహాయమంత్రి డాక్టర్ జితేంద్రసింగ్‌కు విన్నవించారు.

తిరుపతి, షిర్డి పుణ్యక్షేత్రాలను లక్షలాది మంది భక్తులు సందర్శిస్తుంటారు. తిరుపతి–షిర్డి మధ్య వారానికి ఒకసారి రైలు సౌకర్యం ఉంది. ఈ రైలు ద్వారా తిరుపతి నుంచి షిర్డి వెళ్లడానికి ఇరవై ఆరున్నర గంటల సమయం పడుతోంది. షిర్డి వెళ్లేందుకు మరో ప్రత్యామ్నాయ సౌకర్యం లేనందువల్ల భక్తులు 1400 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. ప్రతిరోజు రైలు సౌకర్యం కల్పిస్తే ప్రయాణ సమయాన్ని, ఖర్చును చాలా వరకు తగ్గించవచ్చు. అలాగే షిర్డికి 150 కిలోమీటర్ల పరిధిలోగల శని సింగనపూర్, నాసిక్, త్రయంబకేశ్వర, జ్యోతిర్లింగ వంటి పవిత్ర క్షేత్రాలకు కూడా వెళ్లేందుకు సౌకర్యవంతంగా ఉంటుంది. డైలీ డైరెక్ట్ ట్రైన్ సౌకర్యం వల్ల ఒంటిమిట్ట, దేవునికడప, కడప పెద్దదర్గా, గుంతకల్లులోని కసాపురం ఆంజనేయస్వామి దేవాలయం, మంత్రాలయంలోని శ్రీ రాఘవేంద్రస్వామి మఠం వంటి పుణ్యక్షేత్రాలను సందర్శించేందుకు అవకాశం లభిస్తుంది. కనుక తిరుపతి–షిర్డి మధ్య ప్రతిరోజు రైలు సౌకర్యం కల్పించేందుకు అవసరమైన చర్యలు తక్షణమే చేపట్టాలని వైఎస్ అవినాష్‌రెడ్డి కోరారు. అదేవిధంగా ప్రస్తుతం రైలు నెంబర్లు 22919/22920 చెన్నై–అహ్మదాబాద్–చెన్నై మధ్య వారానికి ఒకసారి చొప్పున నడుస్తున్నాయని తెలిపారు. అయితే రాయలసీమ నడిబొడ్డున ఉన్న ముఖ్యమైన కడప రైల్వేస్టేషన్‌లో ఇవి ఆగడం లేదన్నారు. ఈ రైళ్లలో అహ్మదాబాద్‌కు వెళ్లేందుకు ప్రయాణికులు రేణిగుంట లేదా గుంతకల్లుకు వెళ్లాల్సి వస్తోందన్నారు. కనుక హం సఫర్ రైళ్లు చెన్నై–అహ్మదాబాద్ (22919), అలాగే అహ్మదాబాద్–చెన్నై (22920) రైళ్లు కడప రైల్వేస్టేషన్‌లో ఆగేలా చర్యలు తీసుకోవాలంటూ సంబంధిత అధికారులను ఆదేశించాలని రైల్వేశాఖ మంత్రికి విన్నవించారు.



కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

వేముల మండలంలోని యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ కోసం రీచ్–1, 2, 3 పైపులైన్, టైయిలింగ్ పాండ్ నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతులకు యూసీఐఎల్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కేంద్ర అణుశక్తిశాఖ సహాయమంత్రి డాక్టర్ జితేంద్రసింగ్‌కు విన్నవించారు. ఇప్పటికే భూములు కోల్పోయిన వారికి కలెక్టర్ ద్వారా నష్టపరిహారం చెల్లించి అవార్డు పాసైన భూములకు సంబంధించిన రైతులకు ఆర్‌అండ్‌ఆర్ పాలసీ మేరకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. టైయిలింగ్ పాండ్ వెదజల్లుతున్న కాలుష్యం కారణంగా తాము అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని, కనుక ఆ గ్రామం మొత్తాన్ని యూసీఐఎల్ సేకరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. రాచకుంటపల్లె గ్రామానికి చెందిన 300 ఎకరాల రైతుల భూమిని యూసీఐఎల్ తక్షణమే సేకరించేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని వైఎస్ అవినాష్‌రెడ్డి కేంద్ర మంత్రికి విన్నవించారు.

దళితుడిపై దాడికేసు విచారణ

రామసముద్రం : ఆర్.నడింపల్లె దళితవాడకు చెందిన ఎస్.పవన్‌పై గడ్డివాము విషయంలో ఫిబ్రవరి 2న దాడి జరిగింది.. ఎస్‌ఐ రవికుమార్ దాడి జరిగిన స్థలానికి వెళ్లి సోమవారం విచారణ చేపట్టారు.

అన్నం కోసం వెళ్లి అసువులు బాసింది

సంబేపల్లె : ఆమెది రెక్కాడితే గాని డొక్కాడని జీవితం. కడుపు నింపుకునేందుకు కాసింత అన్నం మెతుకుల కోసం కూతురుతో కలిసి కూలీ నాలి చేసుకుంటూ బతుకీడుస్తోంది. ఈ అన్నం కోసమే ఆశగా రోడ్డు దాటుతున్న ఆ వృద్ధురాలిని వాహనం ఢీకొంది. ఆకలి తీర్చుకోకుండా ఆమె ప్రాణం అనంతవాయువుల్లో కలిసిపోయింది. ఈ విషాద ఘటన హృదయమున్న ప్రతి ఒక్కరిని కలచివేసింది.

చిత్తూరు– కర్నూలు జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జరిపిటి తిమ్ములమ్మ (77) అనే వృద్ధురాలు మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు మండల పరిధిలోని కడియాలవాండ్లపల్లె క్రాస్ సమీపంలో చిన్న గుడిసె వేసుకొని తిమ్ములమ్మ, ఆమె కూతురు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. ఈ క్రమంలోనే ఆళ్లగడ్డకు చెందిన సుబ్రమణ్యం అనే వ్యక్తి , వారి కుటుంబ సభ్యులతో కలిసి అరుణాచలం నుంచి సొంత గ్రామానికి వెళుతున్నాడు. సంబేపల్లె మండల పరిధిలోని కడియాలవాండ్లపల్లె క్రాస్ సమీపంలో కారు నిలిపి భోజనం చేశారు. ఈ క్రమంలో భోజనం మిగలడంతో సమీపంలో ఉన్న తిమ్ములమ్మను పిలిచారు. ఆమె జాతీయ రహదారి దాటుతుండగా పీలేరు వైపు నుంచి వస్తున్న ఐచర్ వాహనం ఆమెను ఢీకొంది. తిమ్ములమ్మ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. కాగా ఆమెతో పాటు రోడ్డు దాటుతున్న సుబ్రమణ్యం కూడా గాయపడటంతో అతన్ని చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని సంబేపల్లె పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తిమ్ములమ్మ

కౌన్సిల్ హాల్ రహస్యం

- అటెండర్ వద్ద ఉండాల్సిన తాళం చెవి ఎవరి దగ్గర ఉందో...?
- ఒకరిపై ఒకరు చెప్పుకుంటున్న నగరపాలక సిబ్బంది
- నగరపాలక ముఖ్య అధికారి వద్ద ఉన్నట్లు ఆరోపణలు



నగరపాలక కౌన్సిల్ హాల్‌కు తాళం వేసి ఉన్న దృశ్యం

కడప టాస్క్‌ఫోర్స్ : కడప నగరపాలక సంస్థలో మూడో అంతస్తులో ఉన్న కౌన్సిల్ హాల్.....నగరపాలక సర్వసభ్య సమావేశం జరిగే గది అది. అయితే ఆ గది తాళం చెవులు ఎవరి వద్ద ఉన్నాయన్నది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. సాధారణంగా అటెండర్ వద్ద ఉండాల్సిన దాని తాళం చెవులు ఎవరి వద్ద ఉన్నాయన్నది అంతుచిక్కని విషయంగా మారింది. గత రెండు సమావేశాల్లో ఎమ్మెల్యే మాధవికి మేయర్‌తో సమానంగా వేదికపైన కుర్చీ వేయలేదని గొడవ జరిగి సభలో గందరగోళం నెలకొన్న సంగతి అందరికీ తెలిసిందే. వాస్తవంగా జీహెచ్ఎంసీ నిబంధనల ప్రకారం మేయర్‌తో సమానంగా ఎమ్మెల్యేలకు కుర్చీ వేయాలన్న నిబంధన ఏదీ లేదు. అలా ఉంటే ఎమ్మెల్యే మాధవి తన అధికారాన్ని ఉపయోగించి ఎప్పుడో వేయించుకునేవారనడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు. అన్ని మున్సిపల్ కార్పొరేషన్లలో ఇదే తరహా సాంప్రదాయం ఉంది. కానీ కడప కార్పొరేషన్‌లో గతంలో మేయర్‌తోపాటే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కుర్చీలు ఉండేవి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా అవి అలాగే ఉన్నాయి. కానీ ఎమ్మెల్యే మాధవి విద్వేష పూరిత రాజకీయాలకు తెరలేపి, మేయర్ ఇంటిపైనే చెత్త వేయించడంతోనే ఇరు పార్టీల మధ్య ఉన్న స్నేహపూరిత వాతావరణం దెబ్బతిన్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ క్రమంలో మేయర్ తన విచక్షణ అధికారాన్ని ఉపయోగించి అధ్యక్ష స్థానం మినహా మిగిలిన అందరికీ కార్పొరేటర్లతో సమానంగా కుర్చీలు వేయించారు. దీన్ని అవమానంగా భావించిన ఎమ్మెల్యే మాధవి గత రెండు సర్వసభ్య సమావేశాలు జరక్కుండా అడ్డుకున్నారు. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను అధికార పార్టీలోకి లాక్కొని మరీ గత సమావేశంలో మరింత రచ్చ చేశారు. ప్రజా సమస్యలు పక్కనబెట్టి తనకు పైన కుర్చీ వేసేంత వరకూ సమావేశాలను జరగనివ్వనని భీష్మించారు. అయినప్పటికీ పాలకవర్గం వ్యూహాత్మకంగా వ్యవహరించి గత సమావేశంలో ఎజెండాలోని అన్ని అంశాలను ఆమోదించుకుంది. మళ్లీ జరుగబోయే సర్వసభ్య సమావేశంలోనూ కుర్చీపైనే రచ్చ జరుగుతుందని భావించిన నగరపాలక ముఖ్య అధికారి... ఎమ్మెల్యేలకు కూడా పైన ఆసనాలు వేయించి తాళాలు తన వద్ద ఉంచుకున్నారని నగరపాలక వర్గాలు కోడై కూస్తున్నాయి. ఎవరికీ తెలియకుండా ఆ కౌన్సిల్ హాల్ తాళం చెవులు ఎక్కడ ఉన్నాయో...ఆ గదిలో అంత రహస్యంగా ఏం చేశారో ఇప్పటికి కాకపోయినా... రాబోవు రోజుల్లో తెలియక మానదు.

గంజాయి స్వాధీనం

కలికిరి(వాల్మీకిపురం) : గంజాయి తరలిస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 2.25 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు వాల్మీకిపురం సీఐ ప్రసాద్ బాబు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. పట్టణ పరిధిలో ప్రత్యేక నిఘా ఉంచి అనుమానితులను విచారిస్తుండగా పోలీసులను చూసిన మహిళ, ఐదుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా చేతిలో ప్లాస్టిక్ కలిగి ఉండి పారిపోవడానికి ప్రయత్నించారు. సిబ్బంది అప్రమత్తపై వారిని అదుపులోకి తీసుకోగా వారి వద్ద 2.25 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. గంజాయితో పాటు ఐదు మొబైల్ ఫోన్‌లు, 20వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా పట్టణ పరిధిలోని సాకలవారిబండ ప్రాంతానికి చెందిన కాలపల్లి అంజమ్మ, ఇందిరమ్మకాలనికి చెందిన సయ్యద్ ఖలీల్, దయ్యాలబండకు చెందిన ఎస్.సమీర్, నమాజ్‌కట్ట వీధికి చెందిన నిమ్మనపల్లి కిరణ్, దయ్యాల బండకు చెందిన కత్తి సిద్దార్థగా గుర్తించారు. అంజమ్మ ఇతర ప్రాంతాల నుంచి గంజాయి తెప్పించి స్థానికులైన కొందరితో కలిసి విక్రయిస్తున్నట్టు విచారణలో వెల్లడైంది. నిందితులను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన ఎస్‌ఐ చంద్రశేఖర్, ఏఎస్‌ఐ కరీముల్లా, హెచ్‌సీలు దస్తగిరి, వేణు, పీసీలు లక్ష్మీపతి, మధు, అబ్దుల్లా, రెడ్డిప్రసాద్, అనిత, హోంగార్డులు బాబాప్రసాద్, రిజ్వాన్‌లకు రివార్డుల కోసం ఉన్న తాధికారులకు నివేదించనున్నట్లు సీఐ తెలిపారు.



నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ ప్రసాద్‌బాబు, ఎస్‌ఐ చంద్రశేఖర్

కల్వర్టు పై నుంచి పడి వృద్ధుడి మృతి

మదనపల్లె : కల్వర్టు పైనుంచి పడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తాలూకా సీఐ కళావెంకటరమణ కథనం మేరకు.. పొన్నెటిపాలెం పంచాయతీ మోట్లపల్లికి చెందిన కృష్ణప్ప (70) కూలి పనులు చేసుకుని జీవనం సాగించేవాడు. ఇతను 5 రోజుల క్రితం రాత్రి మోట్లపల్లి సమీపంలోని కల్వర్టు వద్ద కింద పడిపోయి చనిపోయాడు. సోమవారం కల్వర్టు వద్ద దుర్వాసన వస్తుండటంతో గమనించిన స్థానికులు తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో తాలూకా ఎస్‌ఐ చంద్రమోహన్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కుళ్లిన స్థితిలో మృతదేహం ఉండడంతో అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి కుమారుడు శంకర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



కృష్ణప్ప (ఫైల్)

ఆర్యవైశ్యుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

రాష్ట్ర మంత్రులు టీజీ భరత్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి టౌన్ : ఆర్యవైశుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్, రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని గాంధీబజారులో వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో ఆర్యవైశ్యులకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. వీరి అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించేందుకు ప్రభుత్వంతో చర్చిస్తామన్నారు. కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాలవారు సుఖసంతోషాలతో జీవిస్తున్నారని చెప్పారు.



వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న మంత్రులు టీజీ భరత్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి